కథ

# దేవర

ఎస్.నాగేంద్రనాథ్ రావు
99638 22520

దేవర ముందు కూర్చున్న పెద్ద పటేలు చేయి ఊపాడు.. 'ప్రారంభించండి!' అన్నట్లుగా. పక్కనే కూర్చున్న పూజారి పిడికిలితో పసుపు తీసి దేవర మీద చల్లాడు. ఆ క్షణం కోసమే కాచుకు కూర్చున్న కొమ్ముబూరలు గాలిలోకి లేచాయి. ఒక్కసారిగా అందరూ బూరలు ఊదగానే.. 'డమ్‌డమ్' అంటూ డోలు వాద్యాలు మోగాయి.

ఆ శబ్దం.. చుట్టూ ఉన్న కొండల్లో ప్రతిధ్వనిస్తూ లయాన్వితంగా మోగసాగింది. పెద్ద పటేలు లేచి వారి దగ్గరికి వచ్చాడు.

''బెర్ర పటేలు వాసోమందోడు'' అని గుసగుసగా చెప్పిందో ఒక అమ్మాయి.

భుజాల మీద చేతులు వేసుకొని నిలబడ్డ కోయ పడతుల దండ, కొండ చిలువలాగా కదిలింది.

''రేరేలాయొ రేరేలాయొ.. రేలా రేలా
రేల రేలా, రేలా రేలా, రేల రేలా, రేలా రేలా
ఇత్తాకిని పుంగారే లచ్చీ నా బంగారే
తాడిగుంట టీయ్ టోయ్..'' అంటూ గానం సాగింది.

ఆ పాటకు అనువుగా డోలు వాద్యాలు మోగాయి. అడవి మారుమోగింది. దేవరకు పూజ ప్రారంభమైంది.

కొండ దేవరకు పూజ చేస్తున్న ఆ ప్రాంతం భద్రాచలం అడవుల్లో చింతూరు నుండి మధ్యప్రదేశ్ వెళ్లే మార్గంలో ఉంది. అక్కడంతా భాష కోయలు ఉంటారు. ఆ ప్రాంతం దాటి ఇంకా ముందుకు అడవుల్లోకి వెళితే.. గోండు జాతి వారు ఉంటారు.

భాష కోయల పండుగల్లో కొండదేవర పండుగ చాలా ముఖ్యమైనది. ఆ తర్వాత పచ్చ పండుగ, భూమి పండుగ, చిక్కుళ్ల పండుగ అంటూ చాలా పండుగలు చేసి దేవరను పూజిస్తారు. భాష కోయలు నిష్కపటంగా ఉంటారు. నమ్మితే ప్రాణాలు ఇవ్వడానికి ఏమాత్రం సంకోచించరు.

అడవిలో అందరి ఇళ్లూ ఒకచోటనే ఉండవు. అక్కడొక ఇల్లు, ఇక్కడొక ఇల్లు ఉంటాయి. అన్నిటినీ కలిపి ఊరు లేదా గుంపు అంటారు. ఆ ఊరి పేరు చింతలమెట్ట.

చింతలమెట్ట గుంపులో నక్కలబోడు ప్రదేశంలో ఒక కోయగుడిసె ఉన్నది. దాంట్లో సిరవడు, లచ్చి కాపురం ఉంటున్నారు. సిరవడు అనే పదం శ్రీరాముడు అనే పేరుకు వికృతి కాబోలు. కోయల పేర్లు అలాగే ఉంటాయి.

చింతలమెట్ట పక్కనే ఉన్న ఎస్టేట్ రాజారాం దొరది. వాళ్ల తాతల కాలం నుండి అది వారి అధీనంలోనే ఉన్నది. సిరవడి తండ్రి అరసడు కూడా ఆ ఎస్టేట్‌లోనే పనిచేసేవాడు. ఆ కుటుంబానికి జీతం ఇచ్చి తగు సౌకర్యాలు కల్పించేవారు ఆ దొరలు. అడవికి దూరంగా గౌరీపేటలో రాజారాం నివసించే భవంతి ఉన్నది.

రాజారాం దొర ఆరోజు పనిమీద దూరంగా వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్నాడు. అడవి ప్రాంతం కాబట్టి కార్లు ఉపయోగించరు. అతను ఎప్పుడూ జీపులోనే ప్రయాణం చేస్తాడు. తను బయలుదేరిన ప్రదేశం నుంచి చుట్టూ తిరిగి వెళితే రాత్రిపూట చాలా ఆలస్యం అవుతుందని, తమ ఎస్టేట్ గుండా చింతలమెట్ట మార్గంలో దగ్గరతోవ ఉండటం వల్ల, ఆ దారిలోనే ప్రయాణం చేయాలనుకున్నాడు రాజారాం దొర.

సాయంకాలం అవుతున్నది. మరో గంట ప్రయాణం చేస్తే ఇంటికి చేరిపోతాడు. కానీ, అకస్మాత్తుగా వర్షం ప్రారంభమైంది. ఒక్కోసారి కుండపోత వర్షం కొద్దిసేపు ఆపకుండా కురిస్తే.. అడవిలో వాగులు, ఒర్రెలు పొంగి పారుతాయి. చాలాసేపటి దాకా ఆ నీటి ఒరవడి తగ్గదు. ఆ నీటి ప్రవాహం వేగంగా ఉండటం వల్ల దాటడానికి అవకాశం ఉండదు. రాజారాం పరిస్థితీ అదే అయింది. ఒర్రె బాగా పారుతూ ఉండటం వల్ల దాటలేక పోయాడు.

వర్షం, బురద వల్ల జీపు ముందుకుపోలేని పరిస్థితి ఏర్పడింది. జీపును అక్కడే ఆపేసి సిరవడి ఇంటివైపు నడిచాడు దొర. సిరవడిని తోడు తీసుకుని ఎస్టేట్‌కి వెళ్లి, ఆరోజు అక్కడ విశ్రాంతి తీసుకుని మర్నాడు ఇంటికి వెళ్ల

